RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..



## డేటా సెంటర్లు...

9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్‌కు ప్లానింగ్

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, జూన్ 15, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 56 | పేజీలు: 8 | వెల : రూ.1



## అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

హైదరాబాద్ జూన్ 13, (వాయిస్‌టుడే) : రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల ఆక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి

(మిగతా 2వ పేజీలో)

## వర్షపు నీటి నిల్వల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి: సీఎం రేవంత్

### వర్షాకాల సన్నద్ధతపై ఉన్నత స్థాయి సమీక్ష..
### శాఖల సమన్వయ లోపాలు పునరావృతం కాకూడదు



హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విపత్తుల సన్నద్ధత, వ్యవసాయ కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా హైదరాబాద్ నగరంలో తలెత్తిన ట్రాఫిక్ సమస్యలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణలో శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మానవ తప్పిదాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులను హెచ్చరించారు. వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, నీటిని వేగంగా తొలగించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే నీరు భూగర్భంలోకి ఇంకిపోయేలా శాశ్వత చర్యలు అమలు చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయ అవసరాల దృష్ట్యా రైతులకు ఎరువుల సరఫరా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతు వేదికలను యూరియా పంపిణీ కేంద్రాలుగా వినియోగించుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజల భద్రత, వ్యవసాయ అవసరాలు, ట్రాఫిక్ నిర్వహణ, విపత్తుల నివారణ అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.



## రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్.. హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం: కేటీఆర్

హైదరాబాద్: వాయిస్ టుడే : ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత పార్టీ నాయకులనే వెన్నుపోటు పొడిచిన వ్యక్తి అని విమర్శించారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌పై తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. తెలంగాణలో జరుగుతున్న అవినీతి, అక్రమాల విషయాన్ని

(మిగతా 2వ పేజీలో)



# విద్యార్థుల విజయాలకు అండగా నిలిచిన విజయ్ దేవరకొండ

**అచ్చంపేట విద్యా చరిత్రలో సువర్ణ అధ్యాయం.. 188 మంది మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

అచ్చంపేట, జూన్ 14: వాయిస్‌టుడే : అచ్చంపేట నియోజకవర్గ విద్యా చరిత్రలో నిలిచిపోయే విధంగా మెరిట్ విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 9వ, 10వ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నియోజకవర్గ పరిధిలోని 188 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ, ఉన్నత విద్య వైపు వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10,116 చొప్పున, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.5,116 చొప్పున ప్రోత్సాహక నగదును పంపిణీ చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలోని తుమ్మన్‌పేట గ్రామానికి చెందిన ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ దాతృత్వంతో ఈ ప్రతిభా పురస్కారాలను అందజేయడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం అచ్చంపేట నియోజకవర్గ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు.



# డేటా సెంటర్లు...

## 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్‌కు ప్లానింగ్



విశాఖపట్టణం, జూన్ 13, ( వాయిస్ టుడే ) : ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036–37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్‌వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్‌ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్‌ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్‌వాల్ట్, సీటీఆర్‌ఎల్‌ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడింది: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**అమ్మపాలెంలో గులాబీ జెండా ఆవిష్కరణ**



కొణిజర్ల, జూన్ 14: వాయిస్ టుడే : ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలంలోని అమ్మపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ గులాబీ జెండాను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితర ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, బీఆర్ఎస్ నాయకులను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు పోలీసులను వినియోగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత ప్రాధాన్యత లభించిందని, ప్రస్తుతం ఆ వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేపట్టనున్నారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు డీజేలు, డప్పు చప్పుళ్లు, పూల వర్షం మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొని బీఆర్ఎస్‌కు మద్దతుగా నినాదాలు చేశారు.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధిత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

## రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్.. హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం: కేటీఆర్



కాంగ్రెస్ అధిష్టానానికి తెలియజేసినందుకే ఆమెపై కక్షసాధింపు చర్యలు చేపట్టారని అన్నారు.ప్రజాస్వామ్య దేశంలో హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నానని ముఖ్యమంత్రి ప్రకటించడం సిగ్గుచేటని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను "అట్టర్ ఫ్లాప్ సినిమా"తో పోల్చిన ఆయన, ఇంటర్వెల్‌కే ఫలితం తేలిపోయిన సినిమా మాదిరిగా కాంగ్రెస్ పాలన ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. సగం పాలనా కాలం ముగిసినా ఒక్క ప్రధాన హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని కేటీఆర్ అన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ స్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ కూడా అమలు కాలేదని దుయ్యబట్టారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలులోనూ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంకా భారీ మొత్తంలో బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమని కేటీఆర్ మండిపడ్డారు. పేదలకు కొత్త ఇళ్లు నిర్మించకపోయినా, ఇప్పటికే ఉన్న ఇళ్లను కూల్చివేయడం అన్యాయమన్నారు. కేసీఆర్ పాలనలో పేదలకు పట్టాలు ఇచ్చి గృహ హక్కులు కల్పించగా, ప్రస్తుత ప్రభుత్వం వారి జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఆరోపించారు. విద్యుత్, తాగునీటి రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని గుర్తుచేసిన కేటీఆర్, 2014కు ముందు హైదరాబాద్‌లో తీవ్ర విద్యుత్, మంచినీటి సమస్యలు ఉండేవని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించామని, తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. తిరిగి అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య రంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, పెద్ద ఆసుపత్రులు, బస్తీ దవాఖానలు, పేదల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గ రాజకీయాలపై స్పందిస్తూ, త్వరలో ఉపఎన్నిక వచ్చే అవకాశం ఉందని, ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటు విలువైనదని, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ లాభాల కోసం సింగరేణి ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు: ఉప ముఖ్యమంత్రి భట్టి



మంచిర్యాల, జూన్ 14: వాయిస్ టుడే : రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణి ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హెచ్చరించారు. సింగరేణి కార్మికుల శ్రమ, ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా జరుగుతున్న ప్రచారంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సందర్శించిన భట్టి విక్రమార్క, గనిలో నిర్వహించిన ఓపెన్ హౌస్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణిపై జరుగుతున్న ఆరోపణలపై ప్రజల ముందే వాస్తవాలను వెల్లడించారు. సింగరేణి అభివృద్ధి, విజయాల వెనుక కార్మికుల చెమట, కష్టం, అంకితభావం ఉన్నాయని ఆయన అన్నారు. అలాంటి కార్మికుల గౌరవాన్ని దెబ్బతీయడానికి చేసే ఏ ప్రయత్నాన్నైనా ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. కొందరు రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కేంద్ర ప్రభుత్వానికి రాస్తున్న లేఖల్లో ఎలాంటి వాస్తవం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజలకు నిజాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఓపెన్ హౌస్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ప్రభుత్వం ఎప్పుడూ నిజాలనే మాట్లాడుతుందని, ఆ నిజాలను ప్రజల ముందుంచడం తమ బాధ్యత అని చెప్పారు. తెలంగాణకు సింగరేణి తలమానికమని పేర్కొన్న భట్టి విక్రమార్క, నిరాధార ఆరోపణలతో సంస్థ ప్రతిష్ఠను మసకబార్చే ప్రయత్నాలు దురదృష్టకరమన్నారు. తెలంగాణ భవిష్యత్తును, సింగరేణి వంటి ప్రజల ఆస్తులను రాజకీయ లాభాల కోసం వాడుకోవద్దని రాజకీయ పార్టీలకు సూచించారు. సింగరేణి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆస్తి అని ఆయన అన్నారు. దాని వనరులు, వ్యవస్థలు, బలం అన్నీ ప్రజలవేనని, వాటిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. దోపిడీదారులు, అవకాశవాదులు సింగరేణిపై కన్నేస్తే సహించబోమని హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తనిఖీల సందర్భంగా గనుల భద్రతా ప్రమాణాలు, రవాణా రికార్డులు, ఉత్పత్తి వివరాలను పరిశీలించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో మరో 28 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తి కొనసాగించేందుకు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించినట్లు తెలిపారు. సింగరేణిలోని అన్ని ప్రక్రియలు ఆధునిక కంప్యూటరైజ్డ్ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్మికులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు, వారి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, సింగరేణి సంస్థ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# జూనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇవ్వాలి

## పదోన్నతల్లో తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన

## తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ రైట్స్ అసోసియేషన్ డిమాండ్



నాచారం (వాయిస్ టుడే): టిఎస్పిఎస్సి ద్వారా నియమితులైన గ్రూప్ 4 జూనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ రైట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సూపర్ న్యూమరారీ జూనియర్ అసిస్టెంట్లు పోటీ పడితే 20 సంవత్సరాల పైగా పదోన్నతి ఆలస్యమయ్య ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులుగా పరమాత్మ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విజయ రామరాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 81, 85 ద్వారా వీఆర్ఏలను సూపర్ న్యూమరరీ పోస్టుల్లో నియమించిన గత ప్రభుత్వం, వారిని ఉన్నపలంగా రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణిస్తూ ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొంతమంది అధికారుల చర్యల వల్ల ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంటనే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ న్యూమరారీ పోస్టుల్లో విలీనమైన వారికి సాధారణ కేడర్ ఉద్యోగులతో సమానంగా సీనియార్టీ ప్రొబేషన్ పదోన్నతి అవకాశాలు కల్పించడం నియామకాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ చర్యలతో జూనియర్ అసిస్టెంట్లు రికార్డ్ అసిస్టెంట్లు ఆఫీస్ సబార్డినేటర్లు ఇతర సిబ్బంది పదోన్నతుల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూప్ 4 ద్వారా నియమితమైన జూనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగుల హక్కులను కాపాడాలని కోరారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం చట్టపరమైన పోరాటాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లతో మాట్లాడి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రకటించే ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ కార్యవర్గం ప్రతినిధులు దుర్గ భవాని, సుమన్ నాయక్, చంద్రమోహన్, గౌతమ్, సాయి పవన్, రమేష్ నాయక్, మణిక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.



### జగద్గిరిగుట్ట డివిజన్ ఆర్ జి కె కాలనీలో నీటి సమస్యలు, చిరు వ్యాపారుల సమస్యలపై పాదయాత్ర

కుత్బుల్లాపూర్ జూన్ 14(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ( ఆర్ జి కె ) కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యలను మరియు చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అతి త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ గణేష్, డీసీసీ స్పోక్స్‌పర్సన్ భారత్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రషీద్ , పిల్లి ఆంజనేయులు, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, యువరాజ్, మహిళా నాయకురాలు కౌసల్య, చంద్రకళ, అనిత రెడ్డి, మాధవి రెడ్డి తదితరులు, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.



### మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తాం

#### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్ జూన్ 14(వాయిస్ టుడే): సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి ప్రగతి నగర్ లోని జిపిఆర్ లేఔట్ కాలనీవాసులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.ఎస్, కాలనీవాసులు రమణారెడ్డి, శ్యామ్ సింగ్, శివ నాగరాజు, వెంకట దుర్గాప్రసాద్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఓసి కాపీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ జూన్ 14(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 290 డివిజన్ ( సుభాష్ నగర్) ఎస్ ఆర్ నాయక్ నగర్ కి చెందిన వేంకట మని కుమార్ అనారోగ్యం కారణంగా నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సందర్భంగా వారికి మూడు లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి కాపీ నీ వారి కుటుంబ సభ్యులకు స్థానిక మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి అనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి సెక్రెటరీ, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, కూన రాఘవేంద్ర గౌడ్, ప్రభాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సాంబశివరావు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి

కుత్బుల్లాపూర్, జూన్ 14(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మల్లంపేట్ పోచమ్మ ఆలయం దగర నిర్వహించిన 46వ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, మల్లంపేట్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి గణేష్,పద్మారావు, మనోజ్ రెడ్డి, రేవంత్ రెడ్డి, గురవారెడ్డి, హరి, శ్రీనిధి, వాణి, మల్లంపేట్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

### SIRపై ప్రత్యేక కార్యాచరణ సమావేశం బీజేపీ ఉప్పల్ నియోజకవర్గం BLA 1

#### పోతగాని గోపాల్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే): SIR పై ఉప్పల్ నియోజకవర్గ ప్రత్యేక కార్యచరణ సమావేశం BLA -1 పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల మంగళవారం సాయంత్రం 6:00 గంటలకు మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ లో నిర్వహించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తలుగా ఎయిజూ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు NVSS ప్రభాకర్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు S. మల్లారెడ్డి, మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, SIR జిల్లా జూ- కన్వినర్ గొరిగే కృష్ణ, మరియు SIR నియోజకవర్గం టోలీ సభ్యులు. కావున ఈ సమావేశనికి నియోజకవర్గంలోని 407 బూత్ ల దీూా-2,లు 140 శక్తికేంద్ర ఇంచార్జులు తప్పక రావాలని కోరుతున్నాము. ఈ SIR ద్వారా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు స్వచ్ఛందంగా వినియోగించుకునేలా చేయాలని, దొంగ ఓట్లను, ఒకటికంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఓట్లను తొలగించి, లేని ఓటర్ల ఓట్లను, అర్హత ఉన్నవారికి కొత్త ఓటరు గా నమోదు చేసేవిదంగా మనం సన్నాయత్తం కావటానికి ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అందరు తప్పక, విధిగా రావాలని ఉప్పల్ నియోజకవర్గ BLA-1 పోతగాని గోపాల్ గౌడ్ ప్రతి ఒక్కరిని కోరారు.



### రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి పాదయాత్ర

జూబ్లీహిల్స్ 14 జూన్ ( వాయిస్ టుడే )రహేమత్‌నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి కార్మిక్‌నగర్ నుంచి ప్రతిభానగర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహమత్‌నగర్‌లో రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని, పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్లను జలమండలి అధికారులు పూర్తి చేయలేదని ఆయన ఆరోపించారు. మూడు నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నా స్పందన లేదని విమర్శించారు. రోడ్లు దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, డ్రైనేజీ నీరు వాటర్ పైప్‌లైన్లలో కలుస్తోందని స్థానికులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

వారం రోజుల్లో కార్మిక్‌నగర్--ప్రతిభానగర్ రహదారుల పనులు పూర్తి చేయకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని, అవసరమైతే మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని రావుల శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కమఠం నరసింహా రెడ్డి , జయంత్ , ఘనీ, గడ్డం శ్రీధర్ , లింగరాజ్,కృష్ణ , విజయ్ సింగ్, రొంపి.బాలకృష్ణ ,మొహ్సిన్ ,మోయిజ్, నరసింహ,కురుమూర్తి , ప్రభాకర్ , గణేష్, అల్తాఫ్ , అశోక్ ,ఖాజా తదితరులు పాల్గొన్నారు



### విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి: బుచ్చిరెడ్డి

#### ప్రతిభకు ప్రోత్సాహం.. సాయిరాం కాన్వెంట్ హై స్కూల్‌లో విద్యార్థులకు నగదు బహుమతులు, ఘన సన్మానం

ఉప్పల్, జూన్ 14: పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో సాయిరాం కాన్వెంట్ హై స్కూల్ లో విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ తో పాటు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎం.మనస్వి,585, ఎం. సాహితీ580, భావన 570, మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా సాయిరాం కాన్వెంట్ హై స్కూల్ చైర్మన్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కృషి గుర్తించి వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో గత 35 సంవత్సరాల నుండి పాఠశాలను నిర్వహిస్తున్నామని ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధిస్తున్నామని తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థులను అన్నిరంగంలో తీర్చి దిద్దుతున్నామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు. నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తమ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానస, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




### బీఎస్ఐటీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆవిష్కరణ

#### యువ పారిశ్రామికవేత్తల కృషి అభినందనీయం: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 14: పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు బీఎస్ఐటీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను విడుదల చేసి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞానం, దూరదృష్టి, దృఢ సంకల్పంతో కొత్త అవకాశాలను సృష్టిస్తూ ఉపాధి కల్పనకు తోడ్పడటం అభినందనీయమన్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు సాంకేతిక రంగంలో నైపుణ్యాభివృద్ధికి ఇలాంటి సంస్థలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి, దేశ ఆర్థిక పురోగతికి యువ పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని ఆయన అన్నారు.

వార్తా సేవలు, న్యాయ సేవలు, గృహ సంబంధిత సేవలు, ఈ-కామర్స్, విద్యార్థుల వసతి, పర్యాటక సేవలు తదితర రంగాలకు సంబంధించిన డిజిటల్ వేదికలను బీఎస్ఐటీ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక ఆధారిత సేవలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని వివరించారు. బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ స్థాపకులు, సీఈఓలు భాను చందర్ గరిగెల, శారద నేనావత్ ఆధ్వర్యంలో గత 11 సంవత్సరాలుగా కృత్రిమ మేధస్సు (ఏఐ), సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వెబ్‌సైట్‌ల రూపకల్పన, మొబైల్ అప్లికేషన్ల అభివృద్ధి, ఈఆర్‌పీ పరిష్కారాలు, క్లౌడ్ ఆధారిత సేవల రంగాల్లో సంస్థ విశేష సేవలందిస్తూ కార్యకలాపాలను విస్తరించుకుంటూ వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రముఖులు, ఉద్యోగులు మరియు ఆహ్వానితులు పాల్గొన్నారు.

### సమాజ సేవకు గుర్తింపు లయన్స్ క్లబ్ ఆఫ్ కోటి 320డిలో పాక నవీన్ బాబు లయన్‌గా ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, జూన్ 14: సమాజానికి ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా పాక నవీన్ బాబు ని లయన్స్ క్లబ్ ఆఫ్ కోటి 320డి లో అధికారికంగా 'లయన్‌గా' నియమిస్తూ ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో సమాజ సేవకు ప్రాణం పోస్తూ, పేదల సహాయం, విద్యావంతులకు సహకారం అందిస్తూ వస్తున్న పాక నవీన్ బాబు సేవలను లయన్స్ క్లబ్ భారీగా ప్రశంసించింది. ఆయన సేవా తత్వాన్ని గుర్తించి, వాలంటీరింగ్‌లో ఆయన చూపిస్తున్న ప్రతిభకు గాను ఈ గౌరవం లభించింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు, జిల్లా అధికారులు మరియు ఇతర సీనియర్ లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. పాక నవీన్ బాబు లయన్స్ జట్టులో చేరడం ద్వారా క్లబ్ బలం మరింత పెరిగిందని, భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మందికి సేవ చేయడానికి ఇది దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడం నాకు ఎప్పుడూ గర్వకారణం. లయన్స్ క్లబ్ వంటి గొప్ప సంస్థలో భాగమవడం వల్ల నా సేవలకు మరింత వేగం పుంజుకుంటుంది. అవసరార్థులకు ఎప్పుడూ అండగా ఉంటానని అని ప్రతిజ్ఞ చేశారు.

వాయిస్
హైదరాబాద్
సోమవారం 15 జూన్ 2026



## కల్లెం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మోతీనగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

జూబ్లీహిల్స్ 14 జూన్ (వాయిస్ టుడే): మోతీనగర్‌లోని హిమకీర్తి అపార్ట్‌మెంట్, వెంచర్-3 వద్ద ఆదివారం (14-06-2026) ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, ఉచిత కళ్లజోడులు మరియు అవసరమైన వారికి ఉచిత కంటి ముత్యబిందు (క్యాటరాక్ట్) ఆపరేషన్ల సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని టీజీట్రాన్స్‌కో అకౌంట్స్ ఆఫీసర్ డాక్టర్ కల్లెం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, మోతీనగర్‌లోని రివైవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సలహాలు అందించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజవంతం చేశారు.



## ఓఆర్ఆర్ పై కారు లారీ ఢీ... ఒకరు మృతి

నాగారం, జూన్ 14:-(వాయిస్ టుడే): మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధి లోని ఔటర్ రింగ్ రోడ్డు పై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఘట్ కేసర్ నుండి కీసర వైపు వస్తుండగా రాంపల్లి దయారా సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు పైన కారు లారీలు ఢీకొన్నాయి. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులో ఒకరు మృతి చెందారు, ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతిడు మరియు గాయాలు అయినా వారి వివరాలు తెలియాల్సి ఉంది.



## శ్రీనివాస కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నాగారం, జూన్ 14:-(వాయిస్ టుడే): నాగారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో నిర్వహించిన నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి, పంబాల సరితా రమేష్, మహిపాల్ రెడ్డి, బలరాజ్ యాదవ్, ఓంప్రకాశ్, సోమిరెడ్డి, కుమార్, మాదిరెడ్డి సుధాకర్ రెడ్డి, దాసరి శివారెడ్డి, ఆల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రావు, వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డికి, నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. కాలనీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు.



## ఆలేరు పట్టణంలో కచ్చ కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కచ్చ కాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ఆలేరు పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న కచ్చ కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత నిర్మాణంగా తీర్చిదిద్దేందుకు రూ.2 కోట్ల 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలేరు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కచ్చ కాల్వ అసంపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు పారుదల సమస్యలు ఏర్పడుతున్నాయని, ఈ నిర్మాణం పూర్తయిన తర్వాత ఆ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.కచ్చ కాల్వ నిర్మాణం పూర్తయితే ఆలేరు పట్టణంలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేరానుంది..ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పన్నులు సరే.... గుంతల సంగతేంటి....!?





నాగారం, జూన్ 14:-(వాయిస్ టుడే): రోడ్డు పన్ను వసూలు చేస్తే, మెరుగైన రహదారులు కూడా అందించాల్సి బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని శివసేన తెలంగాణ - మేడ్చల్ జిల్లా ఇంచార్జి అక్కుల సురేష్ కుమార్ పేర్కొన్నారు. మన తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో రోడ్డు పన్ను వసూలు చేస్తూ, ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రోడ్డు పన్ను ప్రజల భద్రతతో కూడిన మెరుగైన రహదారి సౌకర్యాల కోసమే గానీ, గుంతలతో నిండిన రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురికావడానికి కాదని. నాగారం--దమ్మాయిగూడ ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి, ప్రజలకు సురక్షితమైన మరియు మెరుగైన రహదారి సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రోడ్డు మీద ప్రయాణించాలంటే ప్రాణసంకటంగా మారిందని ప్రజలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డు లో ఇద్దరు భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సందర్భంలో గుంటలో పడిపోయిన సంఘటన తీవ్ర భయాందోళన కల్గించింది. ఈ బండి కింద భార్యాభర్తల కాళు ళ ఉండి పోయి లేవడానికి ఇబ్బంది పడిన సందర్భంలో దుకాణంలో ఉన్న వారు వచ్చి లేపిన సంఘటనలు ఉన్నాయి. అదృష్ట వశాత్తు వృద్ధ దంపతులకు ఏమికాక పోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. నాగారం - దమ్మాయిగూడ రోడ్డు దుస్థితిని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ప్రయోజనం లేకుండా పోయిందని ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ రోడ్డు ఇంకా అనేక ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలతో పాటు ఎంతో మంది అంగవైకల్యం సంభవించే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ సాగేలా చూడాలి**

**పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు**

**ఉప్పల్ నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ పై బి ఎల్ ఏ లకు అవగాహన సదస్సు**

**హాజరైన ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఇందిర శోభన్, నియోజకవర్గం ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి**

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బి ఎల్ ఏ లకు ఎస్ ఐ ఆర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది.ఉప్పల్ భగాయత్ లోని శ్రీ రస్తు ఫంక్షన్ హాల్ లో పరమేశ్వర్ రెడ్డి జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు ఇంచార్జ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఇందిర శోభన్ గారు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అమలులో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని అన్నారు. నిజమైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగించబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు సైతం అవసరమైన అవగాహన కల్పించి, ప్రక్రియను సజావుగా సాగేలా చూడాలన్నారు.ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి బయటపడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు అవసరమని, ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో బి ఎల్ ఏ లు,ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు,జిల్లా కార్యవర్గ సభ్యులు,పాల్గొన్నారు.

## ఫ్లయింగ్ స్టార్ ఏవియేషన్ అండ్ హాస్పిటాలిటీ అకాడమీ ఘనంగా స్నాతకోత్సవం



లకిడికపూల్ : జూన్ 14 ( వాయిస్ టుడే ): ఎంత గొప్పగా ఎదిగినా.. మూలాలను మరిచిపోవద్దు' అని త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా.టి. అమర్ నాథ్ గౌడ్ యువతను కోరారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఫ్లయింగ్ స్టార్ ఏవియేషన్ అండ్ హాస్పిటాలిటీ అకాడమీ స్నాతకోత్సవం, ప్లేస్మెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ అమర్ నాథ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇప్పుడు మీరు ఉన్నత శిఖరాలకు ఎగిరే స్థితిలో ఉన్నారన్నారు. కానీ మీ వెనక ఉండిపోయిన వారిని మర్చిపోవద్దని...ఒక సింహంలా ఉండాలని.. అది ఏలాగైతే తన కుటుంబాన్ని, ఆప్తులను కాపాడుకుంటుందో.. అలాంటి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈరోజుల్లో మహిళలదే హవా నడుస్తోందని... ఇండిగోలో 'గర్ల్ పవర్' అనే నినాదం విన్నప్పుడు చాలా సంతోషం అనిపించిందన్నారు. మీరంతా కష్టపడినప్పుడు, మిమ్మల్ని మీరు నిరూపించుకుంటేనే కచ్చితంగా వృత్తిలో, సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని అన్నారు. తల్లిదండ్రుల్ని, కుటుంబం, స్నేహితులు, ఆత్మీయులను మరిచిపోవద్దు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దు అని పేర్కొన్నారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమీ సీఈఓ బింగి శివసాయిగౌడ్, అకాశ్ ఏయిర్ కెప్టెన్ ఉదిత్ పన్వార్, ఏయిర్ లింక్ ఫ్లైట్ స్కూల్ అధ్యక్షుడు పృథ్వీ కుర్రా తదితరులున్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామంలో పలు కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు.1. పటేల్ గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తాండూరి గణేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా అతడిని బీర్ల ఐలయ్య పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు.2. పటేల్ గుడం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు బండ జాంగిర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.3. పటేల్ గూడెం గ్రామానికి చెందిన నిలిగొండ నాగరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడగా బీర్ల ఐలయ్య పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

# హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ఘట్టంగా నాచారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రూ.37.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు పరిసర ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడం సంతోషకరమని అన్నారు. చెరువును కేవలం నీటి వనరుగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ఆధునిక విహార కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతోందని తెలిపారు.సుందరీకరణ పనులలో భాగంగా చెరువు చుట్టూ ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, అందమైన ల్యాండ్‌స్కేపింగ్, హరితవనాలు, సిట్టింగ్ ఏరియాలు, అలంకార లైటింగ్, పిల్లల ఆట స్థలాలు, ఫుడ్ కోర్టులు, పర్యావరణహిత సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతం నగర ప్రజలకు ఒక ప్రధాన ఆకర్షణీయ కేంద్రంగా మారనుందని తెలిపారు.అంతేకాకుండా చెరువు పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెంపు, భూగర్భ జలాల సంరక్షణ వంటి అంశాలకు కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే నగర్ పరిసర ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, స్థానిక ఆస్తుల విలువలు కూడా పెరుగుతాయని చెప్పారు.ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయిజన్ శేఖర్, దీ=నా పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు చెరువు అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు."ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తాం... ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కట్టుబడి ఉన్నాం" అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.

# ఈ 16,18 భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య LIAFI 1964 జనరల్ బాడీ సమావేశం



నాచారం (వాయిస్ టుడే): భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య LIAFI 1964 జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 17,18వ తేదీన నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు క్లియ చైర్మన్, జనరల్ బాడీ సమావేశ అడ్వైజర్ బోర్డు కో చైర్మన్ కౌటికే విఠల్ తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య సమావేశం లో కౌటికే విఠల్ మాట్లాడుతూ ఈ నెల 17,18 న జరిగే సమావేశంలో 3000 వేల మందికి పైగా సాధారణ మండలి సభ్యులు, LIAFI జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారు అని తెలిపారు. ఈ సమావేశంలో ఏజెంట్లు మరియు పాలసి దారులకు సంబందించిన కీలక అంశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నామని తెలిపారు. ఏజెన్సీ బలగాన్ని మరింత బలోపేతం చేయడానికి, పాలసీ దారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వ్యూహాలను రూపొందిం చనున్నారు. ఏజెంట్ల ప్రయోజనాలను కాపాడటం, నైతిక భీమా విధానలను ప్రోత్సహించడం, భారతదేశ బీమా రంగ అభివృద్ధికి తోడ్పడటం పట్ల తన నిభద్దతను పునరుద్గాటిస్తుంది అని తెలిపారు. పాలసీదారుల కు సంబంధించిన అంశాలపై సంబంధిత పై అధికారులకు వినతులు సమర్పిస్తామని తెలిపారు. ఈ సమాఖ్య భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని సమాఖ్య సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొనే అందరికీ తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి మాట్లాడుతూ శ్రీఖుటఱ సీనియర్ నాయకుల గత కార్యకలాపాలు,సలహాల ను స్వీకరించి సమాఖ్య బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు. రాజ్యాంగ కమిటీ చైర్మన్,అడ్వైజరీ పోటీ చైర్మన్ బి ఎన్ చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ షేక్ షాజహాన్, వైస్ ప్రెసిడెంట్ ఎమ్మెస్ మూర్తి, కోశాధికారి బి శ్రీరామ్ మహిళా ప్రతినిధి హేమలత, సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి సునీల్ కుమార్, హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి సీనయ్య, పబ్లిసిటీ కో చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తామనడం సంతోషకరం

– కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు ఎండి అక్తర్



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):– జర్నలిస్టులకు సొసైటీల పేరుతో కాకుండా ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేయడం సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు ఎండి.అక్తర్ అన్నారు. న్యూఢిల్లీలో శనివారం జర్నలిస్టులతో జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ, "జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే సంకల్పంతోనే కేబినెట్ సబ్ కమిటీ వేశాం. మీకు ఎలాంటి సమస్య ఉన్నా మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకురండి. సబ్ కమిటీ ఒకే చోట కూర్చొని సిఫార్సులు తీసుకువస్తే, మీరు టీ తాగే లోపే మినిట్స్ రాసి కేబినెట్‌లో ఆమోదిస్తాం" అని చెప్పారు. వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇచ్చే విధానం వల్ల భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు రాకుండా ఉంటాయని సీఎం వివరించారు. "సొసైటీలపై పిటిషన్ వేయడం సాధ్యమే, కానీ ఒక్కొక్కరి పేరు మీద ఇస్తే ఎవరూ పిటిషన్ వేయలేరు. ఒక్కొక్కరి పేరు మీదే వేయాల్సి వస్తుంది. అది ఆచరణ సాధ్యం కాదు. భవిష్యత్తులో ఈ ఇళ్ల స్థలాలపై ఎలాంటి వివాదాలు రాకూడదన్నదే మా ఉద్దేశం" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ నిర్ణయంతో వారి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల కోసం సేవ చేస్తున్న జర్నలిస్టులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇళ్ల స్థలాలు కేటాయిస్తా మనడం సంతోషకరమైన వార్త అని అందుకు జర్నలిస్టులు ఎంతో రుణపడి ఉంటారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు ఎండి అక్తర్ అన్నారు.

## కట్నం డబ్బులు ఇవ్వలేనోడివి బతకడమెందుకు?

### సొంత అక్క, బావ వేధింపులతో యువకుడి ఆత్మహత్య



జవహర్‌నగర్: సొంత అక్క, ఆమె భర్త, వారి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జవహర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాలు.. జవహర్‌నగర్ చెన్నాపురానికి చెందిన నవీన్ (29) ప్రైవేటు ఉద్యోగి. అతడి సోదరి మమత మొదటి భర్తకు విడాకులివ్వడంతో తుర్కయంజాల్‌కు చెందిన బొమ్మరాజు కృష్ణతో రెండో వివాహం చేశారు. 5 తులాల బంగారం, అర కిలో వెండి, ఇతర కట్నకానుకలిచ్చి వివాహం జరిపించారు. అక్కా బావ, అత్తమామలు అదనపు కట్నం కావాలని నవీన్‌ను, అతని కుటుంబ సభ్యులను వేధించారు. 'కట్నం ఇవ్వడం చేతకాని నువ్వు బతికి ప్రయోజనం ఏంటీ? నీవు చనిపోతే ఆస్తిలో వచ్చే వాటాను కట్నంగా తీసుకుంటాం' అని తరచూ వేధించారు. ఈనెల 5న కృష్ణ, మమత ఖాళీ చెక్కులపై నవీన్‌తో సంతకాలుచేయించుకున్నారు. దీంతో నవీన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తాను పనిచేస్తున్న గోదాంలో ఉరేసుకున్నాడు.




## డా. బి.జి. రఘుపతి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు అందుకున్న బొండాడ రాఘవేంద్రరావు


హైదరాబాద్, జూన్ 14: (వాయిస్ టుడే) : అఖిల భారత తెలగ కాపు బలిజ సంఘం మరియు కాపు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "అవార్డ్స్ అండ్ సివిల్ సర్వీసెస్ అచీవర్స్ ఫెలిసిటేషన్ కార్యక్రమం"లో ప్రముఖ పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్రరావుకు డా. బి.జి. రఘుపతి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు--2023 ప్రదానం చేశారు. వ్యాపార రంగంలో ఆయన సాధించిన విజయాలు, సమాజాభివృద్ధికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా బొండాడ రాఘవేంద్రరావు మాట్లాడుతూ, ఈ గౌరవం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారవేత్తలతో పాటు సివిల్ సర్వీసెస్‌లో ప్రతిభ కనబరిచిన అధికారులను, యువ అచీవర్లను ఒకే వేదికపై సన్మానించడం అభినందనీయమని అన్నారు. ప్రజాసేవకు అంకితమైన యువతను గుర్తించి ప్రోత్సహించడం సమాజ పురోగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా వ్యాపారాభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, విద్యావేత్తలు, సివిల్ సర్వీసెస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ పుట్టినరోజున గాంధీభవన్‌లో భారీ జాబ్‌మేళా



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 19వ తేదీన గాంధీభవన్‌లో భారీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 100 కంపెనీలు గాంధీ భవన్‌కు వస్తున్నాయని వివరించారు. నిరుద్యోగ యువత అందరూ ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో ఎంపీ అనిల్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్షమందికి వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించిందని ప్రస్తావించారు. విద్యార్థుల జీవితంతో ఆడుకుంటున్న కేంద్రంపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు.





## నాచారం హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు 37కోట్లతో సుందరీకరణ

### బిఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో మహోత్సవ వేడుకలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం (వాయిస్ టుడే):నాచారం హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు వద్ద 37కోట్ల రూపాయలతో చేపట్టిన పునరుద్ధరణ, సుందరీకరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చెరువు పునరుద్ధరణ పనులకు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాచారం ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే దిశగా పెద్ద చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 37 కోట్ల రూపాయల ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. చెరువు పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపేలా వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, లైటింగ్, విశ్రాంతి ప్రదేశాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత హెచ్ఎంటి పెద్ద చెరువు నగరంలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందన్నారు. నాచారంలోని పటేల్ కుంట చెరువును కూడా సుందరీకరణ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడల మల్లికార్జున్ గౌడ్, విఠల్ యాదవ్,రమేష్ గౌడ్,ఆశు, బుచ్చయ్య గౌడ్ బిఆర్ ఎస్ పార్టీ అధినేత కార్యకర్తలు, నాచారం స్థానికులు భారీగా సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు ఆర్శనపల్లి సూర్యరావు జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి, జూన్ 14(వాయిస్ టుడే)రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు ఆర్శనపల్లి సూర్యరావు జన్మదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ఆర్శనపల్లి సూర్యరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పవృక్షాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి సూర్యరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ సీనియర్ నాయకులు నాయినేని సూర్యప్రకాశ్‌రావు, ఆకుల వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి యంజాల పద్మయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆర్శనపల్లి సూర్యరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## భరత్‌నగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి పాదయాత్ర

కూకట్‌పల్లి, జూన్ 14(వాయిస్ టుడే) : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ భరత్‌నగర్ కాలనీలో నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని అంతర్గత రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను పరిశీలించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డాక్టర్ నాగిరెడ్డి తెలిపారు. త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పాదయాత్రలో సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, బాబు, నరేష్ కుమార్, మధుకర్, వెంకటేష్ యాదవ్, మూర్తి, రత్నారావు, రాంబాబు, డేవిడ్, బుచ్చిబాబు, నాంచారయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, కాలనీవాసులకు డాక్టర్ పి. నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం: ఎంఈఓ రవీందర్ రాజు



కూకట్‌పల్లి, జూన్ 14(వాయిస్ టుడే) : 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాధికారి (ఎంఈఓ) రవీందర్ రాజు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసి, జూన్ 15 నుంచే వాటిని అందజేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన సంసిద్ధతపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ మరియు పాల పంపిణీ కార్యక్రమం తొలి దశలో భాగంగా కూకట్‌పల్లి మండలంలోని మూడు పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్‌పల్లి, మండల ప్రాథమిక పాఠశాల (బాలికలు), మండల ప్రాథమిక పాఠశాల (బాలురు)లలో జూన్ 15 నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందజేయనున్నట్లు చెప్పారు. పాఠశాల ఆవరణలు, తరగతి గదులు, కిచెన్ షెడ్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మాత్రమే కాకుండా, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కూడా వర్క్‌బుక్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే కొత్త డిజైన్‌తో రూపొందించిన యూనిఫార్ములను త్వరలో విద్యార్థులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్మెంట్) పెంపు, వారి అభ్యసన సామర్థ్యాల అభివృద్ధిపై విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు ఎంఈఓ రవీందర్ రాజు తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సంబంధిత అనుమతులు లేకుండా పాఠశాలలు లేదా తరగతులు నిర్వహించరాదని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత (చైల్డ్ సేఫ్టీ) విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
సోమవారం 15 జూన్ 2026

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



సైదాపూర్ (వాయిస్ టుడే):చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గొడిశాల, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి గ్రామాలకు సంబంధించిన పెద్ద(బెంజరు) చెరువులో చేపలు పట్టేందుకు మత్స్యకారులు వెళ్లారు. మత్స్యకారులంతా చెరువులో వేరువేరుగా చేపలు పడుతుండగా గూల్ల శ్రీనివాస్ (45) అనే మత్స్యకారుడు చెరువులో చేపలు పడుతూ లోతును అంచనా వేయక చెరువులో మునిగిపోయి కనిపించకపోవడంతో తోటి మత్స్యకారులు చెరువులో వెతకగా నీటిలో మునిగి ఉన్న శ్రీనివాస్ మృతదేహాన్ని బయటకు తీసి ఒడ్డుకు చేర్చారు. తండ్రి మృతి దేహం వద్ద డాడీ లే డాడీ అంటూ కుమారుడు విలపించడం అందరినీ కలచివేసింది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ మెడవేని గోపాల్ విజ్ఞప్తి చేశారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కట్ట మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా బోనాలు ఊరేగింపు



నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండలం సాదుల నగర్ గ్రామంలో ఆదివారం నాడు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శివసత్తులతో చిందులు వేస్తూ బోనాలు ఊరేగింపు చేశారు ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ కట్ట మైసమ్మ తల్లి సాదుల నగర్ గ్రామ ప్రజలను చల్లగా చూడాలని ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సాదుల నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

## తిమ్మారావుపేటలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**పీఎస్ఆర్ సేవా ట్రస్ట్ -- కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వందలాది మందికి ఆరోగ్య సేవలు**



ఏన్కూర్/వాయిస్ టుడే : గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామ సర్పంచ్ గూగులోత్ సుమలత మహేష్ ఆధ్వర్యంలో పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి (పీఎస్ఆర్) సేవా ట్రస్ట్, ఖమ్మం కిమ్స్ ఆసుపత్రి సంయుక్త సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన శిబిరానికి తిమ్మారావుపేటతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, న్యూరో సర్జరీ, కార్డియాలజీ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. అంతేకాకుండా ఈసీజీ, మధుమేహం, రక్తపోటు పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వందలాది మంది ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు నిపుణుల సూచనలు పొందారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూగులోత్ సుమలత మహేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో పీఎస్ఆర్ సేవా ట్రస్ట్, కిమ్స్ ఆసుపత్రి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొంది శ్రీనివాస్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఎంపీడబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ం

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధుల మంజూరు



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్14: నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని సాంగ్వి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌లి తెలియజేశారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా నూతన భవనాన్ని నిర్మించేందుకు ఈ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ భోజేందర్ తో పాటు నాయకులకు ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు.

# బీజేపీ ఓట్ల చోరీ కాదు.. సీట్ల చోరీ కూడా పాల్పడుతుంది

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి**

**డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్ఏ-2 (బూత్ లెవల్ ఏజెంటు 2) కాంగ్రెస్ సభ్యుల శిక్షణ కార్యక్రమం**




కరీంనగర్,జూన్ 14(వాయిస్ టుడే): ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్ఏ-2 (బూత్ లెవల్ ఏజెంట్-2) సభ్యుల శిక్షణ కార్యక్రమం కరీంనగర్ నగరంలోని సీతారాంపూర్ పీఎం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,పీసీసీ ఉపాధ్యక్షుడు,మాస్టర్ ట్రైనర్ నమ్మిండ్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం,మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ డీసీసీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులు, లౌకికవాద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త, ప్రజాప్రతినిధి చురుకుగా పాల్గొని అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం బిజెపి కుట్రలను అడ్డుకొని తీరుతామని ఓట్లు చోరీ కాకుండా ప్రతి కార్యకర్త సైనికుల వలె అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాస్టర్ ట్రైనర్, పీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో బూత్ స్థాయి నాయకులు,ఏజెంట్లు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో పాల్గొని ప్రతి ఓటును రక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. సంబంధం లేని కేసులో మీనాక్షి నటరాజన్ నామినేషన్ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారని కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీ కాకుండా సీట్ చోరీ కూడా చేస్తున్నదని మండిపడ్డారు. నిష్పక్షపాతంగా నిజాయితీగా గాందేయవాద పద్ధతిలో ముందుకు వెళుతున్న మీనాక్షి నటరాజ్ నామినేషన్ తిరస్కరించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని కోరారు.ఓటరు నమోదు, మార్పులు,చేర్పుల ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు.మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్,అర్బన్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వైద్యుల అంజన్ కుమార్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి ఇంటిలో ఉన్న ఓటర్ల వివరాలను సమగ్రంగా తెలుసుకుని ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం మాస్టర్ ట్రైనర్ నమ్మిండ్ల శ్రీనివాస్ బీఎల్ఏ-2 సభ్యులు,బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలోఎండి తాజ్,వరాల నర్సింగం,గంట శ్రీనివాస్, పర్వతం మల్లేశం,గుమ్మడి రాజ్ కుమార్, మడుపు మోహన్,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,పడాల అజయ్ గౌడ్,కాంతాల జగన్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,మూల రవీందర్ రెడ్డి,వేల్పుల వెంకటేష్,సిరాజ్ హుస్సేన్, పడిశెట్టి భూమయ్య,కాసెట్టి శ్రీనివాస్,వంగల విద్యాసాగర్, అబ్దుల్ రహమాన్, నిహాల్,కుంభాల రాజ్ కుమార్,మంద మహేష్, గంటకల్యాణి, ముసర్ల రామ్ రెడ్డి, వసీం, ఇమ్రాన్, తోట అంజయ్య,కుర్ర పోచయ్య,విద్యాసాగర్ రెడ్డి,అహమ్మద్ అలీ, వీర దేవేందర్, పెంట శేఖర్,పోరండ్ల రమేష్,మాదాసు శ్రీనివాస్, బొబ్బిలి విక్టర్,సత్తినేని శ్రీకాంత్,హస్తపురం తిరుమల, జీడి రమేష్,హాజీ,అనిల్ కుమార్ గుప్తా, బత్తిని చంద్రయ్య గౌడ్,మాలోతు మహాలక్ష్మి,హసీనా,జ్యోతి రెడ్డి, హనీఫ్, కొలగాని అనిల్,మాజీద్ అలీ ఖాన్,జీఎస్ ఆనంద్, ఖలీల్, సరోజ,శ్రీరాముల రమేష్, మీసా రమాదేవి,కర్రె పావని, మూల జయపాల్,సాయిని తిరుపతి,కామ్రెడ్డి రాంరెడ్డి, రాచర్ల పద్మ,కిరణ్ రెడ్డి,మామిడి సత్యనారాయణ రెడ్డి,దండి రవీందర్, సిరిపురం మనోజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మాదిగ హక్కుల కోసం మరో పోరాటం మాదిగ హక్కుల దండోరా

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 14: నిర్మల్ జిల్లా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మాదిగలకు రావలసిన న్యాయమైన హక్కుల సాధనకు మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ పిలుపునిచ్చారు ఆదివారం నాడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల కి విద్యా ఉద్యోగ రాజకీయ సంక్షేమ రంగాల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం మాదిగ హక్కుల దండోరా పోరాడుతుందని తెలియజేశారు. చేవెళ్ల డిక్లరేషన్ దళిత డిక్లరేషన్ ప్రకారం మాదిగలకు ఇప్పటికైనా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా రాష్ట్రంలోని లెదర్ పార్కులన్నింటిని పునరుద్ధరించి అందులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే లక్ష మంది మాదిగలకు ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేస్తున్నాం. దళిత బంధు స్థానంలో ఇస్తానన్న అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరుతున్నాం అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తుందని బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు అధికమవుతున్నాయని తెలియజేస్తున్నాం. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మాదిగలకు భాగస్వామ్యం ఇవ్వాలని అదేవిధంగా త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో మాదిగలకు అధిక స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమన్వయకర్త అందెల భవాని రెడ్డి అడ్డుగా లక్ష్మణ్ (అంబేద్కర్ సంఘం అధ్యక్షులు), సీనియర్ నాయకులు నల్లూరి ఆనంద్ మాదిగ, బండారి అశోక్ (ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు), సుద్దాల శివకుమార్, మల్లెల కరుణాకర్, బిరుదుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ముధోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో బూత్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 14: ముధోల్,నిర్మల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం ఈరోజు లినిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లి ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్లో, ముధోల్ నియోజకవర్గం బిఎల్ఎ ల శిక్షణ కార్యక్రమం భైంసా శ్రీ కన్వెన్షన్ లో జరగగా పెద్ద ఎత్తున బిఎల్ఎ లు పాల్గొని,సర్ సర్వే పైన శిక్షణ పొందారు.నియోజకవర్గాల ఇంచార్జీల అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గం ఇంచార్జి నారాయణరావు పటేల్,నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు,బూత్ లెవెల్ ఏజెంట్స్ ట్రైనింగ్ కోఆర్డినేటర్స్ టీపీసీసీ ఆదివాసీ ఉపాధ్యక్షులు లింగం నాయక్, కోఆర్డినేటర్ కోట్య నాయక్ పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తుల కోసం ఎన్ హెచ్ అధికారులను కోరిన సర్పంచ్ శ్రీహరి



నర్సాపూర్ (వాయిస్ టుడే) : నర్సాపూర్,-సంగారెడ్డి ప్రధాన రహదారిపై గుండ్ల మాచు నూర్ గ్రామ శివారులోని ఆర్స్ ఫార్మా పరిశ్రమ సమీపంలో ప్రమాదకరంగా మారిన రహదారి విషయం ఆ గ్రామ సర్పంచ్ శ్రీహరి నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ రోడ్డు ఎత్తు పంపులు గా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతోమంది ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన ఇటీవల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన నేషనల్ హైవే అధికారులు ఆదివారం రాత్రి మరమ్మత్తు పనులు చేపట్టారు.

## మైనర్ల రక్షణలో మహిళా పోలీసులు కీలకం

**ప్రజలతో మమేకమై బాధ్యతగా పనిచేయాలి**

**పోక్సో చట్టంపై మహిళా కానిస్టేబుళ్ల కు అవగాహన సదస్సు నిర్వహించిన హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు**



హుజూర్ నగర్: జూన్, 14 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా కానిస్టేబుళ్లకు పోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో హుజూర్ నగర్ సిఐ,చరమంద రాజు, ఎస్ ఐ నరేష్ హాజరై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు మాట్లాడుతూ.. మైనర్ బాలికల రక్షణలో మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పోక్సో చట్టంలోని నిబంధనలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, క్షేత్రస్థాయిలో బాలికలకు చట్టాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు 'పోలీస్ భరోసా' కార్యక్రమం ద్వారా భద్రతా అంశాలు, ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.అంతేకాకుండా, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మహిళా కానిస్టేబుళ్లు ఎలా వ్యవహరించాలి, బాధితుల ఫిర్యాదులను స్వీకరించేటప్పుడు పాటించాల్సిన మర్యాదపూర్వక పద్ధతులు, జనరల్ డైరీ ఎంట్రీలు నమోదు చేయడం, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమాజంలో బాధ్యతాయుతమైన పోలీస్ సిబ్బందిగా పనిచేస్తూ, మహిళలు, బాలికల రక్షణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

## సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి




కరీంనగర్, జూన్ 14(వాయిస్ టుడే): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు, వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న నేటికీ హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆరోపించారు.జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక డిక్లరేషన్లు ప్రకటించి వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి 15000 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత 12000 మాత్రమే ఇస్తామని అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు దఫాలుగా రైతులకు రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారని,గత రబీ సీజన్ పెట్టుబడి సాయం రైతు భరోసా నిధులు నేటికీ పూర్తిస్థాయిలో రైతుల అకౌంట్లో వేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.ఏప్రిల్ నెలలో ఎకరానికి 6000 రైతుల అకౌంట్లో వేసి చేతులు దులుపుకున్నారన్నారు. మే మాసంలో పూర్తిస్థాయిలో రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ప్రకటించి ఆచరణలో విఫలమయ్యారన్నారు.కౌలు భరోసా, కూలి భరోసా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.టిఆర్ఎస్ హాయంలో రెండు పంటలకు కాదు మూడు పంటలకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేసిన ముఖ్యమంత్రి నేడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు 3116 అటకెక్కించారన్నారు.ప్రతి సంవత్సరం జూన్ మాసంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యువకులను మోసం చేశారన్నారు.జాబ్ క్యాలెండర్ అడ్రస్ ఎక్కడ అని ప్రశ్నించారు.పెళ్లయిన ప్రతి ఆడబిడ్డకు కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలు,తులం బంగారం ఇస్తామని వాగ్దానం చేసి తులం బంగారం ఇవ్వకుండా ఆడబిడ్డలను మోసం చేశారన్నారు. ప్రతి మహిళకు నెలకు 2500 అకౌంట్ లో జమ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారన్నారు.కళాశాలకు వెళ్లే బాలికలకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు.కార్మికులకు కనీస వేతన చట్టం అమలు అమలు కావడం లేదన్నారు. నెలకు 26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు విడుదల చేయడం లేదన్నారు. అర్హులైన జర్నలిస్ట్ లకు నివేశన స్థలాలు ఇచ్చి,ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. రైతులకు కార్మికులకు యువజనలకు విద్యార్థులకు మహిళలకు అనేక వర్గాల ప్రజలకు ఎన్నికలకు ముందు 400కు పైగా హామీలు,డిక్లరేషన్లు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల పూర్తయిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ దివాలా కోరు రాజకీయాలకు నిదర్శనం అన్నారు.ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ,ప్రజలకు ఇచ్చిన హామీలను నీటి మీది రాతలుగా భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేసేంతవరకు ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. రాబోయే కాలంలో ప్రజలను సమీకరించి ఎన్నికల హామీలు అమలు అయ్యేంతవరకు ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్,ఎడ్ల రమేష్,డి నరేష్,కొప్పుల శంకర్,జిల్లా నాయకులు గజ్జల శ్రీకాంత్,ఖంపెల్లి అరవింద్,పుల్లెల మల్లయ్య, పున్నం రవి,గుండేటి వాసుదేవ్, సిహెచ్ రాములు, చక్రపాణి, అరవింద్, రాజ్ కుమార్,శివ,వద్లూరి కిషోర్, రాజకుమారి, శ్రీరాముల నారాయణ,పిల్లి రవి,గడ్డంశోభన్, సాయికుమార్, వినయ్,భోగేష్,ఆకాష్,సన్నీ పాల్గొన్నారు.



## మున్నూరు కాపుల అభివృద్ధికి డిజిటల్ సర్వే కీలకం

### సామాజిక, ఆర్థిక, విద్యా ప్రగతికి నూతన వేదిక: కొండయ్యపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర (వాయిస్ టుడే) : మున్నూరు కాపు సమాజ సమగ్ర అభివృద్ధి, ఐక్యత, పరస్పర సహకారానికి డిజిటల్ కుటుంబ సర్వే కీలకంగా మారనుందనిచొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్, జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వెల్పుల శ్రీనివాస్ పటేల్ పేర్కొన్నారు. తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో రూపొందించిన 'డిజిటల్ యాప్ కుటుంబ సర్వే' పోస్టర్‌ను ఆదివారం గంగాధర మండలం కొండయ్యపల్లి గ్రామంలో మున్నూరు కాపు చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్, మాజీ సర్పంచ్ రెండ్ల రాజిరెడ్డి మాజీ ఉపసర్పంచి రెండ్లె వెంకన్న, సంఘం అధ్యక్షుడు గోపు గంగరాజు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వెల్పుల శ్రీనివాస్ పటేల్, రాచమల్లు సుగుణాకర్ పటేల్ తో కలిసిఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజ ప్రగతికి ఖచ్చితమైన గణాంకాలు అత్యంత అవసరమని, సర్వే ద్వారా సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ఈ సర్వేలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సమాజంలోని విద్యావంతులు, వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువతను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమన్నారు. యువతకు విద్య, ఉపాధి, పోటీ పరీక్షలు, వ్యాపార అవకాశాలపై మార్గదర్శకత్వం అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మున్నూరు కాపు సమాజాన్ని డిజిటల్‌గా అనుసంధానించే ఈ వినూత్న కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లాలో ప్రారంభిస్తున్నామని, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండయ్యపల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు కుటుంబ సభ్యులు, యువకులు, సంఘ నాయకులు రెండ్ల శంకరయ్య పటేల్, తిరుపతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రముఖ కవి బుక్కా సత్యనారాయణకు పురస్కారం

ఖమ్మం, జూన్ 14 ( వాయిస్ టుడే): ప్రముఖ కవి, సాహితీవేత్త వికాస వేదిక సాహితీ సంస్థ గౌరవ అధ్యక్షులు బుక్కా సత్యనారాయణకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి స్వర్ణఖంకనం పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం 2026 పురస్కారాల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో భాగంగా వరంగల్లులో బుక్కా సత్యనారాయణకు 'స్వర్ణ కంకణం ' పురస్కారం ప్రధానం చేశారు.



2016 నుంచి ప్రారంభమైన తన సాహితీ ప్రస్థానంలో బుక్కా సత్యనారాయణ ఎన్నో విశిష్ట పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ కవిగా, సాహిత్యంతో పాటు సామాజిక సేవ చేసి పలు ప్రశంసలు అవార్డు రివార్డులు పొందారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో సూపర్డెంట్ గా పదవి విరమణ చేసిన బుక్క సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర సాధనఉద్యమంలో కీలక పాత్ర వహించారు. ఈ పురస్కారం అందుకున్నందుకు గాను ఖమ్మం జిల్లా కవులు, రచయితలు సామాజిక సేవకులు, దళిత బహుజన నాయకులు వివిధప్రజాసంఘాల నాయకులు మేధావులు, సత్యనారాయణకు శుభాకాంక్షలు అందించారు. బుక్కా సత్యనారాయణ మరిన్ని పురస్కారాలు అందుకోవాలని, ఖమ్మం జిల్లా ఖ్యాతిని పెంచే విధంగా వారి సాహితీ ప్రక్రియ సాగాలని, అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుద్ధ్యం సమస్యలు పరిష్కరించాలి




ఖమ్మం, జూన్ 14 ( వాయిస్ టుడే ): వర్షాలు కురిస్తే ఖమ్మం నగరం మొత్తం మురుగునీటితో అపరిశుభ్రంగా మారుతుంది. అధికారులు ముందస్తుగా వర్షపు నీరు రోడ్లపై ఆగకుండా తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ( ఎంఎల్ )మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ నగర కార్యదర్శి శోభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈరోజు స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఖమ్మం నగర కమిటీ సమావేశం కామ్రేడ్ బొల్లి కొమరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని సుమారు 60 డివిజన్లో పారిశుధ్య సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని మరి ముఖ్యంగా విలీన గ్రామాల్లో డ్రైనేజ్ సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు వస్తే నీరు నిల్వ ఉండి దోమలు అభివృద్ధి డెంగి జరాలు వచ్చే ప్రమాదం ఉన్నందున మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ పారిశుద్ధంపై దృష్టి పెట్టి ప్రజలను అనారోగ్యం నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 57 సంవత్సరాలు పూర్తయిన వారందరినీ వృద్ధాప్య పింఛన్కు అప్లై చేసుకోమని చెప్పడం జరిగింది దానికి స్పందించి నగరంలో వేలాది దిమంది అర్హులు పెన్షన్కు అప్లై చేయడం జరిగింది ఆ దరఖాస్తులను విచారణ జరిపించి అర్హులైన వారందరికీ పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్ లో మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య ప్రయత్నం చేసిన గౌస్ ను కఠినంగా శిక్షించాలని ఆ పేద కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరినారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ నాయకులు కే శ్రీనివాస్ భరత్ కంకణాల శ్రీనివాస్ పార్టీ నగర నాయకులు ధరణ్ కృష్ణ సత్తార్ అశోక్ చందు తదితరులు పాల్గొన్నారు.



## నగదు రహిత వైద్యాన్ని వెంటనే అందించాలి

ఖమ్మం, జూన్ 14 ( వాయిస్ టుడే ): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా ఆఫీస్ బెరర్ సమావేశం లో ఈరోజు ఆదివారం జిల్లా అధ్యక్షులు ఎల్ గోపీచంద్ అధ్యక్ష తన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ వి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంప్లాయ్ హెల్త్ కార్డ్స్ కి సంబంధించిన ట్రస్ట్ ను ఏర్పాటు చేయకుండా హడావిడిగా ఉద్యోగుల మరియు పెన్షనర్ల వేతనాల నుండి 1.5% నగదు ని మే నెల వేతనాల నుండి మినహాయించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఏసీ సమావేశంలో నాలుగు రోజులలో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానని ఆసుపత్రులకు మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపి రెండు వారాలు గడిచినను ఈనాటి వరకు ఏ ఒక్క చర్య చేపట్టలేదని ఈ మధ్యకాలంలో ఆసుపత్రి పాలైన వారు స్వంత ఖర్చులత తోటే వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేయడం జరిగింది. సమావేశంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శ్రీ నెల్లూరి వీరబాబు గత నాలుగు నెలలుగా జరిగిన కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టడం జరిగింది అదేవిధంగా బాకీ ఉన్న ఆరు డిఏలను విడుదల చేయాలని పిఆర్సిని వెంటనే ప్రకటించాలని పెన్షనర్ల బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని జూలై 6,7 తేదీన జరిగే సదస్సు జయప్రదంచేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీమతి పి ఝాన్సీ కుమారి,వై రవికుమార్,పి వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శులు వై శ్రీనివాసరావు, కే కుటుంబరావు, అంజయ్య,గణపతి, స్వామి, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, శివ నారాయణ, శ్రీధర్ రావు రామకృష్ణ ఉమేష్ లు పాల్గొన్నారు.



## ముగిసిన కల్నల్ సంతోష్ బాబు మెమోరియల్ చెస్ టోర్నమెంట్ సెలక్షన్స్

### విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు

కరీంనగర్,జూన్ 14(వాయిస్ టుడే): చదరంగం ఆట మాత్రమే కాదని మేదస్సుకు పదును పెట్టి ఏకాగ్రత వ్యూహాత్మక ఆలోచనలను పెంపొందించే ఒక అద్భుతమైన క్రీడ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు.కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ చైతన్య యూత్ క్లబ్ వేదికగా ఆల్ ఇండియా ఫిడ్ రేటెడ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ సెలక్షన్స్ ఘనంగా ముగిశాయి.కల్నల్ సంతోష్ బాబు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో,విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వహించిన చదరంగం పోటీల ముగింపు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.చదరంగం పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తన చేతుల మీదుగా ట్రోఫీలు,ప్రశంసా పత్రాలను అందజేసి క్రీడాకారులను అభినందించారు. సందర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ చదరంగం పోటీలు క్రీడకారుల్లో వ్యూహాత్మక ఆలోచనలను మేదస్సును పెంచడంలో ఎంతో దోహదపడుతాయన్నారు.చెస్ క్రీడా కారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కరీంనగర్ నగరం నుండి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గ్రాండ్ మాస్టర్లుగా ఎదగాలని,చదరంగంలో ప్రతిభను కనబరిచి కరీంనగర్ నగరానికి మంచి గుర్తింపు తీస్కవచ్చేలా క్రీడాకారులు ఎదగాలన్నారు.చదరంగం పోటీల్లో క్రీడాకారులు చతురతతో ప్రత్యర్థులను కట్టడి చేస్తూ పోటీల్లో మెలకువలను నేర్చుకోవాలని పిలుపు నిచ్చారు.దేశ రక్షణలో వీరోచితంగా పోరాడి అమరుడైన కల్నల్ సంతోష్ బాబు జ్ఞాపకార్థం ఇలాంటి జాతీయ స్థాయి ఎంపిక పోటీలను విశ్వనాథ్ చెస్ అకాడమీ కరీంనగర్‌లో నిర్వహించడంఅభినందనీయమన్నారు.చదరంగం తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహించడంలో కృషి చేస్తున్న విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వహాకులకు ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులోనూ క్రీడాకారులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వాహకులు, చైతన్య యూత్ క్లబ్ ప్రతినిధులు, క్రీడాకారులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రామకృష్ణ కాలనీ, మల్లాపూర్‌లో ఘనంగా "స్వచ్ఛ పాఠశాల"

తిమ్మాపూర్,జూన్ 14(వాయిస్ టుడే):మండలంలోనీ మల్లాపూర్, రామకృష్ణ కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక బిజెపి శ్రేణులు"స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలను శుభ్రం చేసే ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని,స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను వివరించారు.రామకృష్ణ కాలనీ,మల్లాపూర్ పాఠశాలలలోని చెత్త,పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను సుందరంగా స్థానిక బిజెపి శ్రేణులు శ్రమదానం చేయడం జరిగిందని తెలిపారు.ఇల్లుతో సమానంగా పాఠశాలలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఎంఏర్పడుతుందన్నారు.విద్యార్థులకు చిన్నతనం నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వల్ల వారు ఆరోగ్యకరమైన పౌరులుగా ఎదుగుతారని,విద్యాసంస్థల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, ప్రజలు, ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఇందులో భాగస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



## రక్తదాతలు ప్రాణదాతలు

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, జూన్ 14(వాయిస్ టుడే): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రక్తదానం మహోన్నతమైన సేవ అని, రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని కొనియాడారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానం చేయడానికి అర్హుడని, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు.ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు,అనారోగ్య సమస్యల సమయంలో రక్తం అందక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,అలాంటి వారికి రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు.గత 20 సంవత్సరాలుగా 41 సార్లు స్వయంగా రక్తదానం చేస్తూ సమాజంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇతరులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ ఆర్.గోపి కృష్ణను ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేకంగా అభినందించారు.సమాజ సేవలో భాగంగా రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా ఆసరా ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మేయర్ అన్నారు.యువత ఎక్కువ సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని మానవతా దృక్పథాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల కిరణ్,చాడ ఆనంద్,అభిషేక్,రాజు,నాగరాజు, చిరంజీవి,కిరణ్,ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.గోపి కృష్ణ, సభ్యులు ఎం.రవిచందర్,ఎస్. నిఖిల్,అద్వైత్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం 15 జూన్ 2026

## ఆరోగ్యానికి చింత చిగురు వల్ల కలిగే లాభలు



ఖమ్మం, జూన్ 14 (వాయిస్ టుడే ): ప్రకృతి సిద్ధంగా లభించే చింతచిగురులో మన ఆరోగ్యానికి మేలు కలిగించే అనేక గుణాలు కలిగి ఉన్నాయి. పెద్దలపరంగా, వైద్యులపరంగా ఈ నిజం అలనాటి నుంచి ఉంది. మానవ శరీరానికి అపారమైన లక్షణాలు, ఔషధ గుణాలు కలిగి ఉన్న చింత చిగురు ప్రధాన పాత్ర పోషిస్తుంది.

చింతచిగురు వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇందులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటివ్గా పనిచేసి విరేచనం సులభంగా అయ్యేలా చేస్తుంది. మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. పైల్స్ ఉన్న వారికి కూడా చింత చిగురు బాగానే పనిచేస్తుంది. ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చింత చిగురు చెడు కొలెస్ట్రాల్ను తగ్గించి అదే క్రమంలో మంచి కొలెస్ట్రాల్ను పెంచుతుంది. చలి జ్వరం తగ్గాలంటే చింత చిగురును వాడాలి అంటారు పెద్దలు. ఎందుకంటే ఇందులోని ఔషధ కారకాలు వైరస్ ఇన్ఫెక్షన్లపై పోరాడుతాయి. చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు చింత చిగురులో ఉన్నాయి. వేడి వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను చింత చిగురు తగ్గిస్తుంది.

గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు చింత చిగురులో ఉన్నాయి. కడుపులో నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది. జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇందు వల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలు దీంట్లో ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలు చింత చిగురులో ఉన్నాయి. తరచూ చింత చిగురును తింటే ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు చింత చిగురును తమ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

డయాబెటిస్ ఉన్న వారు కూడా చింత చిగురును వాడవచ్చు. ఇది వారి రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఆల్కహాల్ను ఎక్కువగా సేవించడం వల్ల కలిగే హ్యాంగోవర్ నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుంది. చింత చిగురును మెత్తగా చేసి దాన్ని కీళ్లపై ఉంచితే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలు చింత చిగురులో ఉన్నాయి. ఇది యాస్ట్రింజెంట్లా పనిచేస్తుంది. నేత్ర సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది.కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుందని నమ్ముతారు.

## నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్

### ఉదయ్ శంకర్ పాటిల్ ఎంపికపై ఝరాసంగంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



ఝరాసంగం జూన్ 14 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ నూతనవ ఎన్నికైన అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామకాన్ని ఝరాసంగం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు.

**ఝరాసంగం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ధ్యేయం**



ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, ఉదయ్ శంకర్ పాటిల్ నాయకత్వంలో మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమర్థవంతంగా నడిపించగల నాయకత్వం ఆయనకు ఉందని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నరు కార్యక్రమంలో.ఝరాసంగం స్థానిక. సీనియర్ కాంగ్రెస్ నాయకులు. వివిధ గ్రామ సర్పంచులు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ మున్సిపాలిటీ నిర్మాణాలు: పెరుమాళ్ రెడ్డి



శ్రీకాళహస్తి, జూన్ 14 (వాయిస్ టుడే): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తొట్టంబేడు గ్రామంలో సర్వే నెం. 298/3లో ఉన్న 1.78 సెంట్ల సెటిల్మెంట్ భూమిపై వివాదం నెలకొంది. ఈ భూమిని 2016లో తిరుపతికి చెందిన భవానీనగర్ నివాసి రూప్ చంద్ తండ్రి శ్రీనివాసులు శెట్టి నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు భూయజమాని పి.ఎస్. పెరుమాళ్ రెడ్డి తెలిపారు.

అయితే, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు ఈ భూమి తమదేనంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, తమ యాజమాన్యంలోని భూమిలో మున్సిపాలిటీ అధికారులు గది నిర్మాణ పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు హైకోర్టు నుంచి పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, అధికారులు వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని పెరుమాళ్ రెడ్డి ఆరోపించారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ వ్యవహరిస్తున్న అధికారులపై విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. ఈ అంశంపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

**గ్రేటర్ వరంగల్లో గులాబీ జెండా ఎగరాలి**

**భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదే**

**గురుకుల పాఠశాలలు, సింగరేణి, హ్యామ్ మోడల్ రోడ్లలో అవినీతి రాజ్యమేలుతోంది**

**పోలీసు అధికారులు చట్ట ప్రకారం వ్యవహరించాలి**

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు**



హనుమకొండ జిల్లా (వాయిస్ టుడే): ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందన్న వార్తలు వస్తున్నాయని మాజీ మంత్రి, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. రాజకీయ పార్టీలుగా పోలింగ్ బూత్ స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు హరీశ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి 20 ఏళ్లకు ఒకసారి ఎస్ఐఆర్ ప్రక్రియ జరగాలని రాజ్యాంగంలో పొందుపరిచారని,ఇప్పటివరకు రెండుసార్లు ఈ ప్రక్రియ జరిగిందని,2026లో మళ్లీ దేశవ్యాప్తంగా ప్రారంభమైందని తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని..హనుమకొండ,వరంగల్ వంటి పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ మరింత కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఫ్యామిలీ మ్యాపింగ్ 99 శాతం పూర్తికాగా సిద్దిపేట పట్టణంలో అది 62 శాతం వద్దనే ఉందన్నారు. హైదరాబాద్,వరంగల్,ఖమ్మం మున్సిపల్ ఎన్నికలు పెండింగ్లో ఉన్నాయని,ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఆర్ఎస్ శ్రేణులు ఎంత చురుగ్గా పాల్గొంటే రాబోయే గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అంత మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. మాజీ కార్పొరేటర్లు,కార్పొరేటర్ పదవులకు ఆశావహులు చురుగ్గా పనిచేయాలని సూచించారు. మొదటి దశలో ఫ్యామిలీ గ్రూపింగ్ జరుగుతోందని..అంగన్వాడీ సిబ్బంది,ఆర్పీలను బూత్ లెవెల్ అధికారులుగా నియమించారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయ పార్టీలను కూడా ఇందులో భాగస్వామ్యం చేశారని,బూత్ లెవెల్ ఏజెంట్లు అధికారులతో కలిసి పనిచేయాలని సూచించారు. వరంగల్ వెస్ట్లో 244 బూత్లకు పార్టీ ఏజెంట్ల పేర్లు సమర్పించామని,అధికారులు సహకరించకపోతే వెంటనే ఫిర్యాదు చేయాలని అన్నారు. 2002లో ఓటు హక్కు కలిగి ఉన్న వారికి సంబంధించిన ఆధారాల ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను జత చేసే విధానమే ఫ్యామిలీ గ్రూపింగ్ అని వివరించారు. కేసీఆర్,బీఆర్ఎస్ అభిమానుల ఓట్లు మిస్ కాకుండా చూసుకోవాలని,ఎవరి ఓటు తొలగింపుకు గురైనా హైకోర్టు వరకు వెళ్లే పరిస్థితి వస్తుందని అన్నారు. బెంగాల్లో 60 లక్షల ఓట్లు,తమిళనాడులో 40 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జూలై వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతుందని,త్వరలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఫ్యామిలీ గ్రూపింగ్ నివేదికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,గ్రేటర్ వరంగల్లో గులాబీ జెండా ఎగరేయాలని,భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు.. స్పందించని కేంద్రమంత్రి**

ఎస్ఐఆర్ పై ప్రసంగించిన మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ గురుకుల పాఠశాలలు,సింగరేణి,హ్యామ్ మోడల్ రోడ్లలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. మంచిర్యాలలో తనపై వ్యాఖ్యలు చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 40 లక్షల టన్నుల బొగ్గు ఎక్కడుందో చూపించాలని డిమాండ్ చేశారు. తాను ప్రశ్నలు అడిగితే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సింగరేణిలో కేంద్రానికి 49 శాతం వాటా ఉందని,అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసినా సరైన స్పందన లేదన్నారు. మట్టి కుప్పలపై బొగ్గు పేరుస్తున్న విషయాన్ని బయటపెట్టాలని కోరారు.

**ధాన్యం కొనుగోలు చేయకముందే ప్రచారాలు..**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేసీఆర్ హయాంలో 92 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశామని..ప్రస్తుత ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయకముందే ప్రచారాలకు దిగిందని విమర్శించారు. వరంగల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై అధికంగా కేసులు నమోదు చేస్తున్నారని,పోలీసు అధికారులు చట్ట ప్రకారం వ్యవహరించాలని సూచించారు. పోలీసుల గౌరవాన్ని పెంచింది కేసీఆర్ ప్రభుత్వమేనని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పోలీసుల సరెండర్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా ఆన్లైన్లో చేపడుతున్నామని,పార్టీకి,కార్యకర్తలకు మధ్య అవినాభావ సంబంధం ఏర్పడేలా కొత్త సభ్యత్వ విధానం ఉండబోతుందని హరీష్ రావు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్,చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి,మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి,తాజా మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు నార్లగిరి రమేష్,పొలపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 25 క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

### 200 కిలోల పటిక,20 లీటర్ల గుడుంబా స్వాధీనం



తొర్రూరు, జూన్ 14 వాయిస్ టుడే : గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్లబెల్లం అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు పట్టుకున్నారు.ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఘటన వివరాలను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ కే. నాగయ్య వెల్లడించారు.పట్టుబడిన నల్ల బెల్లం,ఇతర పదార్థాలు,రవాణాకు వినియోగించిన వాహనం, నిందితుడిని చూపించారు. సీఐ నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం....పెద్ద వంగర మండలంలోని చిన్న వంగర గ్రామ శివారులో విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. చిన్న వంగర గ్రామ శివారులో ట్రాలీ వాహనం అనుమానస్పదంగా కనిపించగా ఆపి తనిఖీ చేయగా 50 సంచుల్లో 25 క్వింటాళ్ల (2500 కిలోలు) నల్ల బెల్లం , 4 సంచుల్లో 200 కిలోల పటిక, 20 లీటర్ల నాటు సారా లభ్యమైంది. రవాణాకు వినియోగించిన ట్రాలీ సీజ్ చేసారు.రవాణా చేస్తున్న మరిపెడ మండలం దాస్య తండకు చెందిన ట్రాలీ డ్రైవర్ గుగులోతు ప్రవీణ్ ను అదుపులోకి తీసుకున్నారు. ఈ రవాణాకు సంబంధం ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ నాగయ్య మాట్లాడుతూ....సారా తయారీకి వినియోగించే బెల్లం, ఇతర ముడి పదార్థాల క్రయవిక్రయాలు,రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుడుంబా కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని, సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని, జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. గుడుంబా ఆనవాళ్లు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని,గుడుంబా నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని కోరారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై ఎన్ రజిత, సిబ్బంది శ్రీనివాస్ కుమార్, శరత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం

తొర్రూరు, జూన్ 14 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలో తొర్రూరు - నర్సంపేట రహదారిపై స్థానిక భద్రకాళి దేవాలయం సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తొర్రూరు మండలం గుర్తురు గ్రామానికి చెందిన జడల నవీన్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నవీన్ తన బైక్పై ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదం జరిగిన తీవ్రతకు నవీన్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలంలో బైక్ పూర్తిగా ధ్వంసమై పడిఉంది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొర్రూరు ఎస్ఐ తోట మహేందర్ రెడ్డి తెలిపారు. నవీన్ మృతితో గుర్తురు గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

## అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని

### బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ

### ఘటన బాధ్యుతలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వెల్లడి

హనుమకొండ (వాయిస్ టుడే): హనుమకొండ సమ్మయ్య నగర్ కు చెందిన రెండ్ల శ్రీనివాస్ కు చెందినటువంటి పాత పుస్తకాల గోదాం శనివారం ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదంలో దగ్ధమవ్వగా శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఘటన జరిగిన తీరును బాధితుడు రెండ్ల శ్రీనివాస్ను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అగ్నిప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం సంఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ప్రమాదం కారణంగా జరిగిన ఆస్తి నష్టంపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి,ప్రభుత్వ పరంగా అందించే సహాయక చర్యలను బాధిత కుటుంబానికి అందించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే నాయిని,ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధుల తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఖుష్ మహల్ గ్రౌండ్స్లో అద్భుతం

### ఒకే వేదికపై 5001 మంది జాతీయ స్థాయి నృత్య ప్రదర్శన

### పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

ఉమ్మడి వరంగల్, (వాయిస్ టుడే): చారిత్రక వరంగల్ కోట సాక్షిగా ఒక సరికొత్త రికార్డు ఆవిష్కృతమైంది. అంజలి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషా,సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఒకే వేదికపై 5001 మంది నృత్య కళాకారిణులతో భారీ జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనను నిర్వహించారు. 'కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్' నమోదుకై ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు,వరంగల్ కుడా (ఖఖణూ) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లు గడ్డపై ఇంతటి చారిత్రాత్మక నృత్య ప్రదర్శన జరగడం గర్వకారణమని, కళలను,సంస్కృతిని ప్రోత్సహించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. 5001 మంది కళాకారిణులతో నిర్మిస్తున్న ఈ రికార్డు తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఆకాంక్షించారు.



## కాజీపేటలో మాజీ మంత్రి హరీష్ రావుకు ఘన స్వాగతం

### ఎస్ఐఆర్ ప్రక్రియ అవగాహన సదస్సుకు హాజరు

కాజీపేట, (వాయిస్ టుడే) : హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ చీఫ్ విప్,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు హనుమకొండకు వచ్చిన మాజీ మంత్రి, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావుకు కాజీపేటలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని హరీష్ రావుకు ఆత్మీయ స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగ్,జోరిక రమేష్, నాయకులు నార్లగిరి రమేష్,గబ్బెట శ్రీనివాస్,శిరుమల్ల దశరథం,సుంచు కృష్ణ,పాలడుగు శివకుమార్,రఘు,దువ్వ కనకరాజు, కోండ్ర శంకర్,నయీమ్ జుబేర్,బెదరకోట రంజిత్,మహమూద్,బరిగెల వినయ్,మర్యాల కృష్ణ,యాకూబ్ పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**